నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | NIZAMABAD


నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం



**గంటైతే వడ్లు పోయేటివి..**

మేము ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నం. ఐదు రోజుల కిందట వరి కోపిచ్చినం. ఆరబెట్టుకుని తీసుకు రావాలంటే కల్లాల్లో వడ్లు ఆరబోసినం. ఒక గంట అయితే మా పంటను అమ్ముకుంటుండే. అసుంటిది క్షణాల్లో వానొచ్చి మొత్తం వడ్లను తడిపేసింది. గింజలు చేతికి వస్త లేవు. ఏమీ తోస్తలేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

**- కోరుట్ల లక్ష్మి, మహిళా రైతు, కొండూర్, నిజామాబాద్ రూరల్**

# రైతన్నకు గుండెకోత

**భారీ నష్టం మిగిల్చిన అకాల వర్షం**

- ఉమ్మడి జిల్లాలో చేతికొచ్చిన పంట నీటిపాలు
- నిజామాబాద్ జిల్లాలో 907 ఎకరాలు..
- కామారెడ్డి జిల్లాలో 114 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యపు రాశులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

**అకాల వర్షం అన్నదాతను** ఆగమాగం చేసింది. ఈదురుగాలులతో కూడిన వాన..రైతన్నకు తీరని నష్టాన్ని మిగిల్చింది. శుక్ర, శనివారాల్లో కురిసిన అకాల వర్షంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చెడగొట్టు వానలకు తోడుగా గాలి దుమారం తీవ్రంగా చేటు చేసింది. దీంతో ఆరుగాలం సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో వర్షానికి నేలకొరిగింది. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా మిగలకపోవడం రైతన్నను కంటి తడి పెట్టిస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో ఇబ్బందులు పెడుతుండడంతో వడ్ల రాశులను ఎండకు ఆరబెట్టగా అకాల వర్షంతో భారీ నష్టం వాటిల్లింది. చాలాచోట్ల కళ్ల ముందే వర్షపు నీటిలో వడ్లు కొట్టుకుపోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని, రైతన్న తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే.. ఎన్నికల హడావుడిలో ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ కార్యక్రమాల్లో అధికార పార్టీ నేతలు గడుపుతున్నారు. నష్టపోయిన అన్నదాతలకు అండగా నిలువకపోవడం గమనార్హం.

–నిజామాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**ప్రభుత్వాలు ఆదుకోవాలి..**



ఇందల్వాయి: వ్యవసాయాన్నే నమ్ముకొని బతుకుతున్నం. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఆరుంగాలం కష్టపడి పంట చేతికందే సమయంలో పంట మొత్తం వర్షంపాలైంది. తడిసిన వడ్లను కోత పెట్టకుండా మద్దతు ధరతోని కొనాలె.

**-గురిజాల నవీన్, ఇందల్వాయి**

**వడ్లన్నీ కొట్టుకుపోయినయ్..**



మాచారెడ్డి: రెండు నెలల క్రితం నీళ్లందక పంట కొంత ఎండిపోయింది. పంటను కోసి కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. 15 రోజుల నుంచి ఎవ్వరూ పట్టించుకుంటలేరు. వడ్లన్నీ కొట్టుకుపోయినయ్.

**-భూక్యా శంకర్, రోటిబండ తండా, సోమార్‌పేట, మాచారెడ్డి మండలం**

**అప్పులెట్ల కట్టాలె..**



ఇందల్వాయి: అకాల వర్షాలతోని కొంత పంట పొలంలోనే దెబ్బతిన్నది. ఇప్పుడేమో.. కోసి తెచ్చిన వడ్లన్నీ తడిసిపోయినాయి. చాలా నష్టపోయినం. ఎవుసాన్ని నమ్ముకొని అప్పుచేసి పెట్టుబడి పెట్టినం. మా కష్టమంతా నీళ్లపాలైంది. అప్పులెట్ల కట్టాలె. సర్కారే నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలె.

**-బెస్త రాధ, ఇందల్వాయి**

**ఒర్రెలకు కొట్టుకుపోయినయ్..**



మాక్లూర్: నాకు ఎకరం పొలం ఉంది. వారం రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబెడుతున్న. వడ్లు కాంటా పెట్టలేదు. రేపు మాపు అంటున్నరు. ఇంతలోనే వర్షానికి వడ్లన్నీ పక్కనే ఉన్న ఒర్రెలోకి కొట్టుకపోయినయ్. కష్టమంతా ఉత్తదే అయ్యింది.

**-రాథోడ్ లీల, సింగంపల్లి, మాక్లూర్ మండలం**

**బోనస్ కోసం మోసపోయినం..**




రెంజల్: వరి కోసి కొనుగోలు కేంద్రం దగ్గర రోజూ ఎండపెడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు 500 బోనస్ ఇస్తమంటే ఎదురు చూస్తున్నం. కానీ మొదటికే మోసం వచ్చింది. వర్షానికి వడ్లన్నీ తడిసిపోయినయ్. జల్దీ కాంటా పెట్టలేరు. వర్షం వస్తే వడ్ల మీద కప్పడానికి ఇక్కడ టాటిపత్రులు కూడా లేవు.

**-పిట్ల గంగాధర్, సాటాపూర్, రెంజల్ మండలం**

**అపార నష్టం..**

మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, సోమార్‌పేట క్లస్టర్ల పరిధిలో 120 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు కామరెడ్డి ఏడీఏ అపర్ణ చెప్పారు. మాక్లూర్ మండలంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కోతకు వచ్చిన పంట నేలకొరిగింది. మామిడికాయలు నేల రాలాయి. ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. నందిపేట్ మండలంలో 50 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 5 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వడగండ్ల వానతో 230 ఎకరాల్లో వరి, ఐదు ఎకరాల మామిడి పంటకు నష్టం వాటిల్లింది. నవీపేట మండలంలో దాదాపు 80 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం నీళ్లపాలైంది. 25 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఈదురు గాలులకు ధర్మారాం గ్రామంలో మూడు రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. కమ్మర్‌పల్లి మండలంలో వరితోపాటు నువ్వులు, సజ్జ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అమీర్‌నగర్, సర్పంచ్ తండా గ్రామాల్లో నివాస గృహాలు, గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్, కొండూర్, తిర్మన్‌పల్లి, జలాల్‌పూర్, ఖానాపూర్ గ్రామాల్లో కోతకు వచ్చిన వరి ఈదురు గాలులకు నేలకొరిగింది. 187 ఎకరాల పంట నష్టం జరిగింది. కాలూర్, జన్నేపల్లి, అశోక్ ఫారం రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దెబ్బ తిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శనివారం పరిశీలించారు. డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇందల్వాయి, రెంజల్, మోర్తాడ్, ఏర్గట్ల, ధర్పల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసిముద్దయ్యింది. ఎప్పుడు కొంటారో తెలియక.. వేచిచూసి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం చూస్తే దళారులకే ధాన్యం విక్రయించడం మంచిదని భావిస్తున్నారు.


కాలూర్–జన్నేపల్లి రోడ్డుపై కూలిన వృక్షం


నందిపేట్ మండలంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్‌లో వర్షపునీటి నుంచి వడ్లను ఎత్తుతున్న మహిళా రైతు, చిన్నారులు



మాక్లూర్‌లో వడ్ల కుప్పలను ముంచెత్తిన వర్షపు నీరు

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, ఏప్రిల్ 20: నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు 623 మంది రైతులకు చెందిన 907 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్‌హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 81 మంది రైతులకు సంబంధించి 114 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి తెలిపారు.

**నిజామాబాద్ జిల్లాలో 907 ఎకరాల్లో పంట నష్టం**

| మండలం | రైతులు | ఎకరాలు |
|---|---|---|
| మాక్లూర్ | 95 | 150 |
| నందిపేట్ | 176 | 230 |
| నిజామాబాద్ రూరల్ | 98 | 189 |
| డిచ్‌పల్లి | 30 | 45 |
| ఇందల్వాయి | 170 | 195 |
| [illegible] | 48 | 82 |
| అక్కిరెడ్డిపల్లె | 36 | 62 |
| మాచారెడ్డి మండలం (సోమార్‌పేట్) | 45 | 52 |


నవీపేట్ మండలం అనంతగిరి శివారులో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు


నవీపేట్ మండలం కమలాపూర్ శివారులో నేలకొరిగిన వరి

## ఇదేం 'తరుగు'డు

- లారీకి ఐదు క్వింటాళ్ల కోత
- తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 20 : బీర్కూర్ మండలంలో ధాన్యానికి రైస్ మిల్లర్లు ఒక్కో లారీకి మూడు నుంచి ఐదు క్వింటాళ్ల తరుగు తీస్తున్నారని రైతులు శనివారం ఆందోళన చేశారు. బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం వద్దకు చేరుకొని సిబ్బందిని ఘెరావ్ చేశారు. అనంతరం రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ లతకు ఫిర్యాదు చేశారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ లత

## సైబర్ మోసగాళ్ల వేధింపులకు యువకుడు బలి


నాగరాజు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20: సైబర్ మోసగాళ్ల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటన ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో చోటుచేసుకుంది. మగ్గిడికి చెందిన నాగరాజు (19) మొబైల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దీంతో కొందరు సైబర్ మోసగాళ్లు నిషేధిత యాప్‌ను ఎందుకు ఇన్‌స్టాల్ చేసుకున్నావంటూ ఫోన్‌చేసి పదేపదే బెదిరించసాగారు. తాము సీబీఐ అధికారులమని, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో భయపడిన నాగరాజు వారికి రూ. మూడువేలు పంపించాడు. దీనిని ఆసరాగా చేసుకున్న మోసగాళ్లు డబ్బులు కోసం మళ్లీ వేధించడంతో నాగరాజు ఈ నెల 18న పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సైబర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

## కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

- మోసం చేసి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ
- 'డబుల్' ఇండ్ల బిల్లులు ఇవ్వకుంటే ప్రాణత్యాగం చేస్తా..
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- కోటగిరి, పొతంగల్‌లో రోడ్‌షో


రోడ్‌షోలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి. పక్కన జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

కోటగిరి/రుద్రూర్, ఏప్రిల్ 20: బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల డబుల్‌బెడ్ రూం ఇండ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే ప్రాణత్యాగం చేస్తానని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన ప్రకటన చేశారు. తనను నమ్ముకొని పేదలు అప్పులు చేసి ఇండ్లు కట్టుకున్నారని, వారి బాధను తాను చూడలేనన్నారు. లోక్‌సభ ఎన్నికల లోపు బిల్లులు రాకపోతే మే 13 తర్వాత లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తానని స్పష్టం చేశారు. అప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకుంటే తాను ప్రాణత్యాగం చేస్తానని, తనకు ఇంతకు మించి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన పొతంగల్, కోటగిరి, రుద్రూర్‌లో జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి తుంగలోకి తొక్కేశాడని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో మన సమస్యలపై పోరాడుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా సురేశ్ షెట్కార్ ఐదేండ్లు పనిచేసినా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మరో పదేండ్లు బీబీ పాటిల్ ఎంపీగా ఉన్నా నియోజకవర్గానికి ఆయన చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ శంకర్‌పటేల్, మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, గంగాధర్, లక్ష్మణ్, సిద్దూ, హమీద్, జుబేర్, శంకర్, విఠల్, సాబేర్, గుడూ, నబీ, జుమ్మాఖాన్ పాల్గొన్నారు.

## మూడో రోజు ఏడు నామినేషన్లు

**-ఇప్పటి వరకు 16 నామినేషన్లు దాఖలు**

కంఠేశ్వర్, ఏప్రిల్ 20: నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. మూడోరోజైన శనివారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఇదివరకే నామినేషన్ దాఖలు చేసిన రాగి అనిల్, భుక్యానందు, దేవతి శ్రీనివాస్ శనివారం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆరె రాజేందర్, గంట చరితారావు, సయ్యద్ అస్గర్, మిర్యాల్కర్ జయప్రకాశ్ నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 16 నామినేషన్లు వచినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

**నామినేషన్ వేసిన గాలి అనిల్‌కుమార్**

జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ శనివారం నామినేషన్ వేశారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, హన్మంత్ షిండే, గంప గోవర్ధన్, సంగారెడ్డి జడ్పీ చైర్మన్ మంజు శ్రీ జైపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


పోచారం శ్రీనివాసరెడ్డి, గంప గోవర్ధన్‌తో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గాలి అనిల్‌కుమార్